# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-02-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు అస్సాంలో పర్యటించనున్నారు.**

2. **2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్ ను ఉభయ సభల్లో ఈ రోజు ప్రవేశపెట్టనున్నారు.**

3. **రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలనకు సంపూర్ణ ఆమోదంగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

4. **ఆలయాల పాలక మండళ్లు బాధ్యతగా పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు.**

5. **కూటమి ప్రభుత్వం డ్రగ్స్ పై తలపెట్టిన యుద్ధం రాష్ట్రాన్ని, యువతను సన్మార్గంలో నడిపిస్తోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వి. అనిత తెలిపారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు అస్సాంలో పర్యటించనున్నారు. ఉదయం డిబ్రూగఢ్‌లోని మోరాన్ బైపాస్ ప్రాంతంలోని ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీకి చేరుకుంటారు. అక్కడ యుద్ధ విమానాలు, రవాణా విమానాలతో పాటు హెలికాప్టర్ల గగనతల విన్యాసాల్ని ఆయన వీక్షించనున్నారు. బ్రహ్మపుత్ర నదిపై నిర్మాణం పూర్తి అయిన కుమార్ భాస్కర్ వర్మ సేతును మధ్యాహ్నం ప్రధానమంత్రి సందర్శిస్తారు. అనంతరం గువాహటీలోని లచిత్ ఘాట్ వద్ద వివిధ పథకాలను మధ్యాహ్నం ప్రారంభిస్తారు. ఈ పథకాలకు 5 వేల 450 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు.

--------------------------

వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్ ను ఉభయ సభల్లో ఈ రోజు ప్రవేశపెట్టనున్నారు. శాసన సభలో 2026-27 బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టనున్నారని శాసన వ్యవస్థ సెక్రెటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాల బడ్జెట్ ను వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టనున్నారని పేర్కొన్నారు. శాసన మండలిలో బడ్జెట్ హోం మంత్రి వంగలపూడి అనిత, వ్యవసాయ అనుబంధ రంగాల బడ్జెట్ ను రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టనున్నారని వెల్లడించారు.

--------------------------

రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలనకు సంపూర్ణ ఆమోదంగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ.. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టారని వెల్లడించారు.

---------------------------

ఆలయాల పాలక మండళ్లు బాధ్యతగా పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్ర గిరి ప్రదక్షిణ రోడ్డును, అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి వర్చువల్ గా ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 40 కోట్ల రూపాయలతో 22 ప్రధాన ఆలయాలకు రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.. 10 కోట్ల రూపాయల వ్యయంతో 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ మార్గాన్ని ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఏలూరు జిల్లా బలివే గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భలే రామలింగస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. ఆలయాన్ని ఆయన నిన్న సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అంతకు ముందు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పార్ధసారథి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

కూటమి ప్రభుత్వం డ్రగ్స్ పై తలపెట్టిన యుద్ధం రాష్ట్రాన్ని, యువతను సన్మార్గంలో నడిపిస్తోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వి. అనిత తెలిపారు. గత 19 నెలల కాలంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు, ఈగల్ విభాగం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. గత ఏడాదిలో ఈగల్ విభాగం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలపై రూపొందించిన వార్షిక నివేదికను ఈగల్ ఐజీ రవికృష్ణ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈగల్ సాధించిన విజయాలను ముఖ్యమంత్రి అభినందించడం ఎంతో సంతృప్తినిచ్చిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

సోషల్ మీడియాకు 16 ఏళ్లలోపు పిల్లలను దూరంగా ఉంచేలా నియంత్రించే విషయంలో చట్టాన్ని తెచ్చే

అంశాన్ని పరిశీలిస్తున్నామని హోం మంత్రి వి.అనిత తెలిపారు. సోషల్ మీడియాను కొందరు వ్యక్తిత్వ హననం చేసే వేదికగా మార్చారన్నారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె నిన్న సమాధానమిస్తూ..

వాయిస్... 25 సెకన్లు

---------------------------

తెలంగాణలో ఇటీవల నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిన్న చేపట్టింది. 116 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థల్లో ఎన్నికలు జరగ్గా మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. తరువాతి స్థానంలో బిఆర్ఎస్, బిజెపిలు నిలిచాయి. కొన్ని నగరపాలక సంస్థల్లో ఫలితాలను ఇంకా ప్రకటించాల్సి ఉంది. పురపాలక సంఘాల మేయర్, వైస్ చైర్‌పర్సన్ ల ఎన్నికలు ఈ నెల 16వ తేదీన నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది.

---------------------------

శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల  బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజైన నిన్న స్వామి వారు  పుష్పపల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పుష్పపల్లకిలో మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపకాంతుల నడుమ శ్రీశైల పురవీధులలో జరిగిన గ్రామోత్సవంలో కోలాటాలు డమరక నాధాలు పలు రకాల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం ముందు పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా తయారు చేసిన పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవార్లు  భక్తులకు దర్శనమిచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని పేర్కొంది.  ఉత్తర కోస్తా, యానాం, రాలయసీమల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెంట్రిగ్రేడ్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఒకటి రెండు చోట్ల పొగమంచు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం  పేర్కొంది.

---------------------------

హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. పలు మార్గాల్లో నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. కాచిగూడ–మధురై,  మదురై–కాచిగూడ, హైదరాబాద్–కొల్లం, కొల్లం–హైదరాబాద్,  హైదరాబాద్–కన్యాకుమారి, కన్యాకుమారి–హైదరాబాద్ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నిర్ణీత వారాల్లో నడపనున్నట్లు తెలిపింది. . ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.

====================